# అత్తగారూ ఆవుపేడా!



## భానుమతీ రామకృష్ణ

ఈ సంవత్సరం పంట పండాల్సినంత పండకపోగా చాలా తక్కువ పండడం మా అత్తగారికి చాలా ఆందోళన కలిగించింది. దీనికి కారణం ఏమిటో తక్షణం కనుక్కోడానికి పంట వ్యవహారం చూసే గోపాల్‌ని పిల్చారు.

గోపాల్ వచ్చి ఆమెముందు నిలబడ్డాడు...

'ఏమిట్రా! ఈ సంవత్సరం పంట యింత తక్కువ పండింది! యిట్లా ఎన్నడూ జరగలేదే! కారణం!...'

గోపాల్ గొంతు సర్దుకుని, 'ఆదేనండీ అమ్మగారూ! ఎరువులేదు పొలానికి...ఎరువు పెట్లా... అసలు కారణం అదీ ...'

'ఎందుకు చాల్లేదురా! ప్రతి ఏటా తోట్లో ఎరువు చాలక బయటకొని వేస్తున్నాంగదా!'

'కొనేవాళ్ళం అమ్మగారూ! కాని పోయిన సంవత్సరం ఈ సంవత్సరం కొన్లా.'

'పోయిన సంవత్సరం సుమారుగా పండింది గదరా! మరి ఎరువు వెయ్య లేదంటావేం'!

'అవునమ్మా! పోయిన సంవత్సరం పంట అంతకుముందు వేసిన ఎరువులసారం కాస్త కూస్త వుండి సుమారుగా పండింది. రెండోపంట నువ్వులేశాం. మిగిలిన కాస్త సారం నువ్వుపంట లాగేసింది ... ఈసారి ఈ పంటకి మనతోట్లో ఎరువు కొద్దిగా వుంటే ఏశాను— బయట కొందామంటే దొరకలేదు...'

'బయట దొరక్కపోవడ మేమిట్రా మనకి మామూలుగా ఎరువులమ్మే వాళ్ళే మైనారు !'

'వాళ్ళేం కాలేదమ్మా! వున్నారు... కాని ఎరువు లేదు వాళ్ళదగ్గిర...

మా అత్తగారికి వోర్పు నశించింది ...

'ఎందుకు లేదూ! అది చెప్పు!...'

'పచ్చిపేడకే డిమాండ్‌గా వుందమ్మగారూ!

'అంటే పచ్చిపేడే పొలాలకు వేస్తున్నారా!...'

'పొలాలకి కాదమ్మా పోష్టర్లకి...

'పోష్టర్లేమిట్రా!'

'సినిమా పోష్టర్లమ్మగారూ!'

'సినిమావాళ్ళకి పేడెందుకురా!...'

'వాళ్ళ కక్కర్లేదమ్మా!...అళ్ళ మొకాలకి...'

'ఏమిటీ! వాళ్ళమొఖాలకి పేడ కావాలా!'

'అయ్యో పెద్దమ్మగారూ! మీ కర్థం గాదేంటి? బయట రోడ్లమీద గోడల కంటించే సినిమా పోష్టర్లల్లో అళ్ళ మొకాలమీద జనం పేడ ముద్దలే దదమ్మా ఏస్తుంటారు!'

'నోహో! ఆదేనా! మొన్న వేణు గుడికెళ్ళి వస్తూ చూశా! గోడలమీద ఏవో సినిమా పోష్టర్లు, వాటి నిండా ముద్దలు ముద్దలుగా మొఖాలు కనబడకుండా వుంటే యిప్పుడొచ్చే సినిమాల్లాగే ఆ పోష్టర్లూ అట్లా కొత్త తరహాలో వేశారేమో అను కున్నా... అయితే అదంతా పేడన్నమాట !'

'అవునమ్మా! ఆ పోష్టర్ల మీదెయ్యడానికే పేడ బంగారంలా కొనుక్కుపోతున్నారు!...'

'అట్లా కొనుక్కొని వెళ్ళి వేస్తార్రా పేడ!'

'అవునమ్మా! మామూలుగా ఎరువుకి మనం తక్కువిస్తాం. అళ్ళు పేడకే ఎక్కువ డబ్బిస్తామంటే అమ్మకేంజేస్తారూ! అసలు యిన్ని గొడ్ల పేడకింత అని కాంట్రాక్టే తీసుకెళ్తావుంటే!...'

'హరి వీళ్ళ అఘాయిత్యం కూలా!... పేడకంత గిరాకీ పెరిగిందా!...'

'అవునమ్మా! అంటేనూ!—సినిమా యిడుదల అయిందంటే పేడకి డిమేండ్ అన్నమాటే! యీరోజు ఏ సినిమా యిడుదలయిందంటే దాని పోష్టర్లేస్తారు గదా! మర్నాడే మరొక సినిమా యిడుదలవుతుందనుకోండి ! ఆ

సినిమా పోస్టర్లు మునుపేసిన పోస్టర్ల మీద అంటిస్తారు అర్ధరాత్రిళ్ళ...'

'అబ్బాగా! అట్లైతే మొదటివాడికి కడుపు మండదూ!'

'మండుద్ది! అందుకే పేడ రెడీగా పెట్టుకోనుంటాడుగా'... అసలు జనంలో రెండు భాగాలున్నారు ... ఒకవైపోళ్ళకి ఒక అక్షరంపై యిష్టం... యింకో వైపోళ్ళకి యింకో అక్షరంపై యిష్టం.. యీవైపోళ్ళు ఆ వైపు అక్షరం మొఖం మీద పేడ పిడ్డ లేస్తే ఆవైపోళ్ళు యీ వైపు అక్షరం మీద పేడముద్ద లేస్తారు...'


'అబ్బో! అక్కో! యింత పేడ! ఎంత పేడ! ... మా చిన్నప్పుడు మా వూర్లో కాముని పండగ చేసేవాళ్ళు. దాన్నే ఉత్తరాదివాళ్ళు హోళీ అంటారు ... ఏదో పిండిలో రంగులు గలిపి ఒకళ్ళ మొఖాలకి ఒకళ్ళు పూసుకొనేవారు అది జాజానుగాని యిదెక్కడా చూళ్ళేదు. యిదేదో పేడ హోళిలాగే వుంది.'

'యింతెందుకమ్మా! మన ఎదురింటి అప్పన్నదు గొడ్డు పెట్టుకొని పాలవ్యాపారం చేస్తున్నాడు గదా! యీ రెండేళ్ళల్లో పేడ అమ్మిన డబ్బుతో మరి అయిదు గొడ్లు కొన్నాడు...'

'అపురా! హవ్వరా! పేడకి యింత దశ పదుతుందని కల్లోగూడా అనుకోలేదురా! అందుకే మన పనిమనిషి పిడకల వ్యాపారం మానేసింది! పేడ దొరక్కనే గాబోలు!'

'యింకేం పిడకలమ్మా! పోస్టర్ల మీద పడ్డ పేడ కాస్త ఎండంగానే ఎవరిక్కనిపించింది వాళ్ళు ఒల్చుకోని పోతావున్నారు పొయిలోకి—మిగిలిన పోస్టరు కాగితాలు ఆవులూ, మేకలూ గోడలమీదినించి లాగి తినేసి పోతున్నయ్...'

'శ్రీరామచంద్రా! ఆ సినిమావాళ్ళు



ఏం పాపం చేశారో! ఏ అమ్మకన్నబిడ్డలో పాపం వాళ్ళమొఖాలమీద అట్లా పేడవేసీ, మేకలుతినీ, హయ్యొయ్యో!...'

'ఏమైనా సినిమావోళ్ళు కానా పుణ్యం చేశారుగదమ్మా! ఆళ్ళఫోటోలు పెట్టుకోని దేవుళ్ళ మాధిరిగా పామరజనం చూస్తావున్నారే!... దానికేమంటారు!...'

'అనేదానికేముందిరా! ఐమాఖర్చుల్లాగే దానికదే! వాళ్ళు పూర్వజన్మలో చేసిన పుణ్యం అట్లా దేవుళ్ళలా ప్రజలు కొల్చేట్టు చేస్తోంది...అలాగే పూర్వజన్మలో చేసిన పాపం యిట్లా వాళ్ళమొఖాలమీద పేడ ముద్దలు వేయిస్తూ, మేకల్చేత, పీకిస్తోంది! —అన్నట్లు పేడంటే గుర్తొచ్చింది... అసలు సంగతి మర్చిపోయినావ్ రేపోమాపో మళ్ళీ పొలం, దున్ని వేరుసెనగ వెయ్యాలన్నాను గదరా! ఎరువు సంగతి ఏం చేస్తావ్! ఏమీ వెయ్యకపోతే యీసారి పొత్తిగా పండేట్టు లేదే!...'

'అదేనమ్మా ఆలోచిస్తావున్నా!— యిక ఎక్కడా దొరక్కపోతే బండికట్టుకోవెళ్ళి అయినకాడికీ ఆ సినిమా పోష్టర్లమీద ఏండిన పేడముద్దలే లాక్కొచ్చేస్తా!—' అని గోపాల్ అంటూండగా,

'హారిపిడుగా! పీడెవడో గట్టివాడే దొరికాడే!— నీ సంగీతాన్ని ఎరువుగా ఉపయోగిద్దాం కక్కో! అంటూ వరెండాలో డిచి లోపలికొచ్చాడు మా అత్త చిన్నప్పుడు చదువుకున్న తట్బాచార్ల మనవడు శ్రీపాదం...

'ఒరే! పాదం! ఎన్నాళ్ళకెన్నాళ్ళకి కనిపించావ్‌రా! యిదేనా రానడం అంతా బాగున్నారా!'

'ఆ! ఈ వూర్లో నాదో చిన్నకచేరి వుంది. అట్లాగే మిమ్మల్ని చూసి వెళ్ళచ్చని వచ్చాను'—

# అత్తగారూ...

'అట్లాగా! అయితే బాగా పట్టుదలగా సంగీతం సాధకం చేశావన్నమాట!...నువ్వు చిన్నప్పట్నుంచీ సంగీతం పిచ్చితో చదువు వెనకబడేశావని మీ తాత చెప్తూండేవాడు— మొత్తానికి కచేరీలు చేసేదాకా వచ్చావన్న మాట?... భేష్! అన్నట్లు నీతోకూడా యింకో సంగీత పిచ్చిది వుండేది మా అన్న మనమరాలు శ్రీ లక్ష్మి...గుర్తుందా'

'లేకేం! చిన్నప్పుడు శ్రీ లక్ష్మికి పిళ్ళారి గీతాలు నేనేగా నేర్పాను! ఎక్కడుంది! ఆ మధ్య శ్రీ లక్ష్మి పెళ్ళయిందని తాతంటూంటే విన్నాను'—

'పెళ్ళికావడమేమిట్రా!యిద్దరుపిల్లలు!... యిక్కడే వుంటూంది ... దానిమొగుణ్ణి ఆ మధ్య ఈ వూరికే బదిలీ చేశారు... మొన్ననే పుట్టింటికెళ్ళింది, వాళ్ళమ్మకు వంట్లో బాగాలేదని చూసిరావడానికి— యిప్పుడు పన్నెండుగంటల బండిలో వస్తోంది...సరిగా సమయానికే వచ్చావు. యిద్దరు పిల్లలయినా దానికింకా సంగీత పిచ్చి వదల్లేదురా! యింకా నేర్చుకోవాలని ఎంత పాకులాడుతుందో చెప్పడానికి లేదు! యిప్పుడొస్తూనే నిన్ను చూసిందంటే యిక్కణ్నుంచి నిన్ను కదల్నివ్వదు! సంగీతం చెప్పమని నీ ప్రాణాలు తీస్తుంది చూడు!...'

'దానికేం చెప్తాను! ... నేను వూరికెళ్ళి చేసేదీ ఏమీ లేదు!...బ్రహ్మచారిగాణ్ణి ఎక్కడున్నా ఒకటే!...సంగీతం బాగా శ్రద్ధగా పట్టుదలగా నేర్చుకొనేవాళ్ళుంటే అలాంటివాళ్ళకి నేర్పించడమే నాకు సరదా!'

'శ్రద్ధేమిటీ! దానికి సంగీతం అంటే ఎంత ప్రాణమో నీకు తెలీదు. అది వంట చేస్తున్నా, పిల్లలకి నీళ్ళు పోస్తున్నా ఏ పని చేస్తున్నా పాడుతూనే చేసుకుంటుంటుంది. అది సంగీతం నేర్చుకోడం దాని మొగుడికీ యిష్టమే!...పాపం దాని సరదాకి తగినట్లు అదృష్టం కలిసిరాలా! యిప్పటికి నలుగురు మాస్టర్లు పోయారు!...'

'ఎక్కడికి పొయ్యారు?'— అన్నాడు గుండె గతుక్కుమన్న శ్రీపాదం వెల వెల బోతూ.

'ఎక్కడికన్నా పోతే బాధే లేదు!... మొదట ఒకాయన్ని పెట్టారు. బాగా విద్వాంసుడు!...పాఠాలు మొదలుపెట్టాడు. పాపం!...వారం కూడా కాలేదు సైకిల్తో వస్తూ లారీకింద పడ్డాడు! ... రెండో ఆయన కూడా మంచి పాటకుడే! నెల రోజులు చెప్పారో లేదో టి.బి. వచ్చి మదనపల్లెకు వెళ్ళిపోయాడు. మళ్ళీ రాలా! ... మూడో ఆయన, దానికి సంగీతం చెప్పడానికి బయల్దేరి వస్తూండగా బస్సుకింద పడ్డాడు పాపం!...నాలుగో ఆయన చెప్పడం మొదలెట్టి నెలరోజులు కూడా తిరక్కుండానే ఒకరోజు గుండె ఆగి ఆస్పత్రిలో పోయాడు.'

అని అత్తగారు చెప్తూంటే శ్రీపాదం మొఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు!...ఒళ్ళంతా చెమటలుపట్టి భయంతో బిగుసుకుపోయాడు కుర్చీలో...

'అన్నట్లు మాటల్లో మర్చేపోయాను కాళ్ళు కడుక్కోరా వెళ్ళి! భోంచేద్దువుగానీ! శ్రీలక్ష్మి వచ్చే వేళయింది.'

'అబ్బే నాకిప్పుడు ఆకల్లేదు. యిప్పుడే టిఫిన్ తిన్నాను వస్తూ వస్తూ దార్లో... అన్నట్లు మర్చిపోయాను అర్జెంట్‌గా నా ఫ్రెండ్‌ని చూడాలి. వస్తానని చెప్పా... వెళ్ళాలి...' అంటూ వెనక భూతాలు తరుముతున్నంత గాభరాగా శ్రీపాదం సంచి తీసుకుని గేటువేపు పరుగెత్తాడు...మళ్ళీ శ్రీపాదం కనిపిస్తే ఒట్టు! ●

